ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.04.06.2026 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు, రేపు రెండు రోజుల పాటు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటిస్తారు. జిల్లాలోని పలు రిజర్వాయర్లు, పంప్ హౌస్ ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతస్థాయి సమీక్ష చేస్తారు.
2. తెలంగాణలో 7,597 కోట్లతో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణకు మోదీ సర్కార్ ఇచ్చిన కానుక అని మంత్రి అన్నారు.
3. రాష్ట్ర సచివాలయంలో ఈరోజు సమావేశమైన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఉద్యమకారుల గుర్తింపుకు విధివిధానాలు అఖిలపక్ష పార్టీల నేతల తో చర్చిస్తున్నారు.
4. రాష్ట్రంలో సవరించిన భూముల మార్కెట్ విలువలు రేపట్నుంచి అమల్లోకి వస్తాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

-----------------------------

**ముఖ్యమంత్రి పర్యటన**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు, రేపు రెండు రోజుల పాటు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటిస్తారు. జిల్లాలోని పలు రిజర్వాయర్లు , పంప్ హౌస్ ల నిర్మాణ పనులను పరిశీలిస్తారు. నారాయణపేట జిల్లా మక్తల్ కు ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 4 గంటల తర్వాత కోయిల్‌సాగర్ ప్రాజెక్టు , కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదిత బ్యారేజీలు ,

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డ్యామ్ ప్రాంతాన్ని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిస్తారు. సుమారు 5 గంటలకు జోగులాంబ గద్వాల జిల్లాలోని గూడెందొడ్డి రిజర్వాయర్ , JNLIS స్టేజ్-1 పంప్‌హౌస్‌ను పరిశీలిస్తారు. సాయంత్రం 6 గంటలకు సోమశిల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సోమశిలలోని మృగవాణి రిసార్ట్ రివర్ ఫ్రంట్‌లో మూడు గంటల పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

**నాగర్ కర్నూల్ పీటీసీ**

ముఖ్యమంత్రి పర్యటన 2

జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని నెట్టెంపాడు పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు సాయంత్రం పరిశీలించనున్నారు. లిఫ్టు 1కి అనుసంధానమైన గూడెం దొడ్డి జలాశయాన్ని పరిశీలిస్తారు. ఈ జలాశయం విస్తరణకు ఇప్పటికే ప్రతిపాదనలు ఉండగా భూ సేకరణ అంశంపై కన్సల్టెన్సీ సంస్థ సర్వే చేసి నివేదికలు ఇచ్చింది. గూడెం దొడ్డి విస్తరణ అంశంలో ప్రస్తుతం సామర్థ్యం పెంపు 11 టీఎంసీలు కాకుండా ఏకంగా 15 టీఎంసీలకు పెంచితే ఎంత మేర ప్రయోజనం ఉంటుందనే దానిపై పరిశీలించి ప్రాథమిక నివేదికను సాగునీటి శాఖ అధికారులు సిద్ధం చేశారు.

**గద్వాల పీటీసీ**

**కిషన్ రెడ్డి**

తెలంగాణలో 7,597 కోట్లతో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంపై కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణకు మోడీ సర్కార్ కానుక ఇచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. NH-63లో ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల మార్గాన్ని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ లోనూ... అలాగే NH-563 లో జగిత్యాల-కరీంనగర్ మార్గాన్ని బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ పద్ధతిలోనూ నాలుగు వరుసల రహదారులుగా విస్తరించనుంది కేంద్రం. దీంతో ఆర్మూర్-మంచిర్యాల, జగిత్యాల-కరీంనగర్ మార్గాల్లో ట్రాఫిక్ కష్టాలు తొలగిపోతాయని కిషన్ రెడ్డి

అన్నారు. తెలంగాణ ప్రగతికి , మౌలిక వసతుల కల్పనకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ నిర్ణయమే మరొక నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.

డెస్క్

**కేశవరావు**

రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు నేతృత్వంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీతో అఖిలపక్షం సమావేశమైంది. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ , ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ హాజరయ్యారు. కాంగ్రెస్ , బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ, సీపీఐ, తెలంగాణ జన సమితి , CPI ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేతలు పాల్గొన్నారు. ఉద్యమకారుల గుర్తింపునకు సలహాలు సూచనలు తెలుపుతున్నారు అఖిలపక్ష పార్టీల నేతలు.

డెస్క్

భూముల విలువ

రాష్ట్రంలో సవరించిన భూముల మార్కెట్ విలువ రేపట్నుంచి అమల్లోకి వస్తాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూముల మార్కెట్ విలువ సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా జరిగిందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అధ్యయనం ఆధారంగా కొత్త ధరలను నిర్ణయించడం జరిగిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చు తగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం మేరకు భూముల విలువ సవరణ జరిగిందని తెలిపారు. ప్రాంతాల వారీగా భూముల మార్కెట్ పరిస్థితులు, రిజిస్ట్రేషన్ల సంఖ్య , బహిరంగ మార్కెట్ ధరలు , ప్రభుత్వ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సమగ్రంగా పరిశీలించిన తర్వాత శాస్త్రీయ పద్ధతిలో కొత్త విలువలను నిర్ణయించామని మంత్రి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయకుండా.. గత ప్రభుత్వ హయాంలో సవరణలు చేయడంతో కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే చాలా తక్కువగా , మరికొన్ని ప్రాంతాల్లో అధికంగా భూముల విలువ ఉందన్నారు.

డెస్క్

**అగ్ని ప్రమాదం**

హైదరాబాద్, అమీర్‌పేటలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్ లో అగ్ని ప్రమాదం జరిగింది. షాపింగ్ కాంప్లెక్స్ రెండో అంతస్తులో ఉన్న ఎంఎస్‌ఆర్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు చెలరేగాయి. క్రమంగా ఇతర దుకాణాలకూ వ్యాపించాయి. భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ఇతర దుకాణాల్లోని వారిని ఖాళీ చేయిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

BK

దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు, సీఎం భేటీ

డిసెంబర్ లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. నిన్న హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి ప్రతినిధి బ్రందం సమావేశమైంది. విద్య , నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం , పరిశ్రమలు, పెట్టబడులు వంటి రంగాల్లో తెలంగాణ, దక్షిణాఫ్రికా పరస్పర సహకారాన్ని మరింతగా విస్తరించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే ఐటీ, ఫార్మా, రక్షణ, ఏరోస్పేస్ వంటి అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని దక్షిణాఫ్రికా ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు.

డెస్క్

విత్తన తయారీలో శిక్షణ

తెలంగాణ విత్తన రంగ అనుభవం నైజీరియా యువతకు ఉపయోగపడాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. శామీర్‌పేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ

విత్తన విద్య, పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిన్న ముగిసింది. నైజీరియాలోని టరాబా రాష్ట్ర యువత ...విత్తన తయారీ రంగంలో శిక్షణ పొందింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ ...టరాబా రాష్ట్ర యువతకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే విత్తన రంగానికి కేంద్రంగా గుర్తింపు పొందిందని మంత్రి తుమ్మల తెలిపారు. శిక్షణ ద్వారా నైజీరియా యువత విత్తన ఉత్పత్తి, హైబ్రిడ్ సీడ్ టెక్నాలజీ, విత్తన శుద్ధి, ప్రాసెసింగ్, వ్యవసాయ వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో పరిజ్ఞానం పొందారని తెలిపారు.

డెస్క్

**ధాన్యం సేకరణ**

రాష్ట్ర వ్యాప్తంగా రబీ ధాన్యం కొనుగోళ్లలో గతేడాది రికార్డును ఈసారి ప్రభుత్వం అధిగమిస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గతేడాది 74.2 లక్షల టన్నుల ధాన్యంను కొనుగోలు చేశామని , అయితే ఈ సీజన్ లో ఇప్పటికే 70 లక్షల 6 టన్నుల ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. మరో 4.95 లక్షల టన్నులు సేకరించాల్సి ఉందన్నారు. దీంతో రికార్డు స్థాయిలో మొత్తం 75 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లవుతుందని తెలిపారు.

డెస్క్

**సిరిసిల్ల జిల్లా ఎస్పీ**

ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత , శాంతియుత సమాజ నిర్మాణం సాధ్యమని.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. తంగళ్లపల్లి మండలం , తాడూర్ లో నిర్వహించిన గ్రామ సభకు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. రోడ్డు భద్రత అందరి బాధ్యతని , రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ , రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. వాహనదారులు స్వీయ రక్షణ , కుటుంబ క్షేమం కోసం తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు.

**BYTE**

**సిరిసిల్ల పీటీసీ**

96 శాతం ధాన్యం కొనుగోలు

కరీంనగర్ జిల్లాలో రైతులు అమ్మకానికి తీసుకొచ్చిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ 96 శాతం పూర్తయిందని కలెక్టర్ చిత్ర మిశ్రా తెలిపారు. ఈ యాసంగికి సంబంధించి 317 కొనుగోలు కేంద్రాల్లో 3 లక్షల 32 వేల 98 మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకానికి వస్తే... 3 లక్షల 18 వేల 959 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. రైతులకు 628 కోట్ల రూపాయలు చెల్లించినట్లు తెలిపారు.

**కరీంనగర్ పీటీసీ**

**సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి**

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు త్వరితగతిన పూర్తి చేసి , ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను రాష్ట్ర దేవాదాయ , అటవీ శాఖల మంత్రి ఆదేశించారు. ఎంజీఎం అభివృద్ధి కమిటీ సమావేశంలో జిల్లా ప్రజాప్రతినిధులు , అధికారులతో కలిసి పాల్గొన్న మంత్రి కొండా సురేఖ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన నిధులు, పరికరాల సమీకరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**వరంగల్ పీటీసీ**